క్లుప్తంగా

భారీ వర్షం



ఒమ్మిలో కురుస్తున్న వర్షం

నెల్లిమర్ల రూరల్: మండలంలో పలుచోట్ల శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దాదాపు అర్ధగంట పాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షానికి ముందు వీచిన ఈదురుగాలులకు ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విద్యుత్ శాఖ విద్యుత్ సరఫరాను నిలిపివేసింది. అయితే ఈ వర్షం తమకు ఎంతగానో ఉపకరిస్తుందని రైతులు చెబుతున్నారు.

నేడు లింగాపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

తెర్లాం: మండలంలోని లింగాపురం, అంట్లవార గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శంబంగి రామకృష్ణ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పాల్గొంటారని, మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

రూ.13 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం



సీసీరోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు

రాజాం: పట్టణంలో గాంధీనగర్‌లో సీసీరోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం చేపట్టారు. మున్సిపల్ అభివృద్ధి నిధులు రూ.13 లక్షలతో ఈ పనులు చేపట్టినట్లు ఏఈ పి.వెంకట్ వెల్లడించారు. మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు పనులను పరిశీలించారు.

చురుగ్గా సరిహద్దురాళ్ల ఏర్పాటు



సర్వేరాళ్లను పరిశీలిస్తున్న సర్వేయర్ అప్పలనాయుడు

వంగర: గ్రామాల్లో సమగ్రంగా భూముల రీసర్వే చేపడుతున్నట్లు మండల సర్వేయర్ వై.అప్పలనాయుడు అన్నారు. అరసాడలో జరుగుతున్న సరిహద్దురాళ్ల ఏర్పాటు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. గ్రామంలో ఇప్పటికే సర్వే పూర్తయిందని, 1632 చోట్ల సరిహద్దు రాళ్ల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్వేయర్లు డి.నవ్య, జి.సింధుజ, జి.కిరణ్ తదితరులున్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం

వంగర: స్థానిక ఎస్‌బీఐలో వివిధ హోదాల్లో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉద్యోగులు పారసాన హరిబాబు, బి.అచ్చెంనాయుడు, జి.అవినాష్, ఎ.ప్రసాద్‌లను శుక్రవారం బ్యాంకు సిబ్బంది ఘనంగా సన్మానించారు. బ్యాంకు అభివృద్ధికి వారు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తులసీరావు, కృష్ణ, రాజు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వాగతం.. సుస్వాగతం..!























మెంటాడ మండలం, చినమేడపల్లి వద్ద కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనకు శుక్రవారం విచ్చేసిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వైఎస్సార్ సీపీ నేతలు, అధికారులు ఘనస్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, జీసీసీ చైర్‌పర్సన్ శోభాస్వాతిరాణి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పావని, కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ట్రైనీ కలెక్టర్ సహజిత్ వెంకట్ త్రినాథ్, ఎస్పీ దీపికా పాటిల్ ఉన్నారు.

-సాక్షి నెట్‌వర్క్

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు



గడప గడపకూ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జ్ వి.ఎస్.ప్రసాద్

విజయనగరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని, దీనిపై ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జ్ వి.ఎస్.ప్రసాద్ అన్నారు. స్థానిక నగరంలోని 43వ డివిజన్, 52వ సచివాలయం పరిధిలోని ఉడా కాలనీ నుంచి అయ్యన్నపేట వెళ్లే మార్గంలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు ఆ ప్రాంత ప్రజలు సాదరస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే సంక్షేమ పథకాలు చేరవేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా అప్పటి జన్మభూమి కమిటీల సిఫారసులు అవసరమయ్యేవని, కానీ ఇప్పుడు అలా కాదని అర్హుడని తెలిస్తే చాలని, పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేస్తున్న గొప్పతనమంతా సీఎం జగనన్నదేనన్నారు. మరోవైపు ప్రతీ గ్రామ సచివాలయ పరిధిలో అభివృద్ధి పనులు కూడా జోరుగా కొనసాగుతున్నాయన్నారు. ఒక్క విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజల అవసరాలను గుర్తించిన ప్రభుత్వం 80 శాతం మేర మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. నగరాభివృద్ధికి అండగా నిలుస్తున్న ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి మనమంతా అండగా నిలవాలని, రానున్న ఎన్నికల్లోనూ ఆయనను మళ్లీ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ మళ్లీ మాయమాటలతో ప్రజలను నమ్మించి, మోసం చేసేందుకు సిద్ధమైన టీడీపీ నాయకుల మాటలు అస్సలు నమ్మవద్దన్నారు. మళ్లీ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మరోసారి సీఎం జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దాసరి సత్యవతి, డివిజన్ అధ్యక్షుడు వంతరాం సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుద్ధ్య విధానానికి సహకరించాలి

- మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములునాయుడు



కొత్తపేట నీళ్లట్యాంక్ వద్ద వాటర్ ట్యాంకర్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములునాయుడు

విజయనగరం: నగరంలో సంపూర్ణ పారిశుద్ధ్య విధానానికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములునాయుడు కోరారు. శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన తాగునీటి పంపిణీ, పారిశుద్ధ్య నిర్వహణ, రక్షిత మంచినీటి పథకాలు, పార్కుల నిర్వహణను పరిశీలించారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా అమ్మకాలు చేపడితే ఉపేక్షించమని హెచ్చరించారు. మహిళా పార్కును సందర్శించిన ఆయన మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పైపులైన్ల లీకులు లేకుండా చూడాలని తెలిపారు. గంటస్తంభం జంక్షన్, కన్యకాపరమేశ్వరి ఆలయ జంక్షన్‌లో చిరువ్యాపారాలు ఇబ్బందికర వాతావరణంలో కొనసాగుతున్నాయని, అక్కడి వ్యాపారుల వల్ల ప్రధాన రోడ్లు చెత్తాచెదారంతో నిండిపోవడంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తలెత్తుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో చిరువ్యాపారుల అమ్మకాలను క్రమబద్ధీకరించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బురదనీరు ఎక్కడ నిల్వ ఉండకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. అందరి సహకారంతో నగర ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు.

జీవామృతంతో చీడపీడల నివారణ

రేగిడి:

జీవామృతంతో వరి, మొక్కజొన్న, కూరగాయల పంటలకు చీడపీడలు ఆశించకుండా నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం ఐసీఆర్‌పీ పైల తవిటినాయుడు అన్నారు. మండలంలోని చాటాయవలస గ్రామంలో రైతులకు జీవామృతం తయారీ విధానంపై ఐసీఆర్‌పీలతో శుక్రవారం అవగాహన కల్పించారు. ఆవుపేడ 5 కిలోలు, పశువుల మూత్రం 5 లీటర్లు, ఇంగువ ద్రావణం 200 గ్రాములు ఐదు లీటర్ల నీటిలో కలిపి ఒక తొట్టిలో నాలుగు రోజులు నిల్వ చేయాలి. ఉదయం, సాయంత్రం కర్రతో సవ్యదిశలో కలపాలి. ఈ మిశ్రమానికి 150 గ్రాముల సున్నం కలపాలి. 200 గ్రాముల ఇంగువ ఒక రెండు లీటర్ల నీటిలో బాగా మరగబెట్టి దానిలో ముద్ద ఇంగువ వేసి చక్కగా కలిపి చల్లారిన తరువాత ఇంగువ ద్రావణాన్ని పేడ మూత్రం ద్రావణంలో కలపాలి. ఈ ద్రావణాన్ని గుడ్డలో వడకట్టాలి. ఈ ద్రావణానికి 200 లీటర్ల నీటిని కలిపి ఒక ఎకరా పొలానికి పిచికారీ చేయవచ్చు. ఈ విధానాన్ని రైతులు తక్కువ ఖర్చుతో పంటలను చీడపీడల నుంచి కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, గుండాల రవి, పాదిలాపు సురేష్, కూనుబిల్లి రమణ, రెడ్డి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కాలిబాటలతో బహుళ ప్రయోజనాలు



చాటాయవలసలో పంటపొలాలను పరిశీలిస్తున్న ఏఓ

రేగిడి: రైతులు ఖరీఫ్‌లో నాట్లు వేసిన వెంటనే కాలిబాటలను ఏర్పాటు చేసుకోవాలని వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని రేగిడి, వండానపేట, చాటాయవలస తదితర గ్రామాల్లో నాట్లు వేసిన పొలాలను శుక్రవారం పరిశీలించారు. కాలిబాటల ఏర్పాటు వల్ల కలిగే ఉపయోగాలను రైతులకు వివరించారు. పంటలకు గాలి, వెలుతురు బాగా తగలడంతో పాటు పురుగు మందులు, ఎరువులు వేసుకునేందుకు కాలిబాటలు అనుకూలంగా ఉంటాయన్నారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన



సచివాలయ భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

రాజాం: మండలంలో రాజయ్యపేట గ్రామంలో నిర్మించిన నూతన గ్రామ సచివాలయ భవనాన్ని ఎంపీడీఓ బాసూరి శంకరరావు శుక్రవారం పరిశీలించారు. నిర్మాణం పూర్తికావడంతో ఎలక్ట్రికల్ పనులు, డోర్ల ఏర్పాటుపై ఆరా తీశారు. వాటిని త్వరగా పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట పీఆర్‌జేఈ ప్రభాకరరావు, గ్రామ సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

సీఎం జగన్‌కు అపూర్వ ఆదరణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: మెంటాడ మండలంలోని చినమేడపల్లి వద్ద కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ నిర్మాణానికి భూమిపూజ చేసేందుకు విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభించిందని, అనంతరం జరిగిన సీఎం సభ కూడా గ్రాండ్ సక్సెస్ అయిందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన సీఎం సభకు హాజరై, కార్యక్రమంను జయప్రదం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అన్ని వర్గాల ప్రజల నుంచి సీఎం జగనన్నకు లభించిన ఆదరాభిమానాలు చూస్తుంటే 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మళ్లీ రికార్డు విజయం ఖాయమని, ప్రతిపక్ష పార్టీల అడ్రస్‌లు గల్లంతవ్వడం ఖాయమన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భాగంగా విజయనగరం జిల్లా ప్రగతికి ముఖ్యమంత్రి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. మరోవైపు విశాఖను పరిపాలనా రాజధాని, భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం, మెంటాడ మండలంలోని చినమేడపల్లి దగ్గర కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఇక్కడ ఏర్పాటవుతున్న వర్సిటీ అన్ని వర్గాల పేదల ఉన్నత చదువుకు ఉపయోగపడుతుందన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు 600 హామీలు ఇస్తే అందులో ఒక్కటి కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ప్రస్తుతం జగనన్న మాత్రం ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతం హామీలు నెరవేర్చి, నిబద్ధతను చాటుకున్నారన్నారు. ద్రోహానికి చంద్రబాబు మారు పేరైతే.. సీఎం జగన్ విశ్వసనీయతకు బ్రాండ్ అంబాసిడర్ అని అభివర్ణించారు. రాష్ట్రంలోని ప్రతీ వర్గానికి మేలు జరుగుతుంటే రాష్ట్ర ప్రజానీకానికి తీవ్ర అన్యాయం జరిగిందని కనీస పరిజ్ఞానం లేని లోకేశ్ మాట్లాడడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో మాయమాటలతో మళ్లీ ప్రజలను నమ్మించి, మోసం చేసేందుకు చంద్రబాబు అండ్ కో సిద్ధమయ్యారని, వారిని నమ్మవద్దన్నారు. 2024లోనూ సీఎం జగన్‌నే మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సీహెచ్ లక్ష్మణరావు, మండల జేసీఎస్ కన్వీనర్ సీహెచ్ సింహాచలంనాయుడు, వైస్ ఎంపీపీలు బి. చంద్రశేఖర్, పి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో సైడ్‌ఎఫెక్ట్స్ లేని చికిత్స



విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

రేగిడి: విద్యార్థులు బాల్యం నుంచి మంచి ఆహారపు అలవాట్లు కలిగిఉండాలని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ అన్నారు. స్థానిక ఉంగరాడ మెట్ట వద్ద ఏపీ బాలయోగి గురుకుల పాఠశాలలో శుక్రవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించి మందులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయుర్వేద వైద్య విధానంలో సైడ్ ఎఫెక్స్ లేకుండా మంచి చికిత్సను పొందవచ్చన్నారు. విద్యార్థులు మంచి ఆహారం తీసుకోవడతో పాటు వ్యాయామం చేయడం, యోగాసనాలు వేయడం ద్వారా శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండవచ్చాన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.సూర్యనారాయణ, పీఎస్ఎన్ మూర్తి, హెల్త్ సూపర్‌వైజర్ టి.శ్రీనివాసరావు, యోగా ఇన్‌స్ట్రక్టర్ ఎం.రామకష్ణ, స్టాఫ్ నర్సు అంజలి, బంగారి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

'శ్రావణ' శోభ



డెంకాడ: వరలక్ష్మీదేవికి పూజలు చేస్తున్న మహిళలు, చిన్నారులు



విజయనగరం రూరల్: ప్రత్యేకాలంకరణలో శ్రావణిలక్ష్మి అమ్మవారు



కోనాడలో దైవ దర్శనానికి క్యూలో నిల్చొని ఉన్న భక్తులు



పూసపాటిరేగ: పూసపాటిరేగలో పూజలందుకున్న అమ్మవారు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్ శ్రీక్షేత్రంలో శ్రావణ శుక్రవారం పూజలు నిర్వహించారు. శ్రావణిలక్ష్మి అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించి, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని, ప్రతీ ప్రాంతంలోని ఆలయాల్లో భక్తులు పూజలు చేయడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

డెంకాడ: శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా మండలంలోని ప్రతీ గ్రామంలో మహిళలు వరలక్ష్మీదేవి పూజలు చేశారు. వేకువజామునే లేచి, ఇళ్లను శుభ్రం చేసి, తలంటు స్నానం చేసి అమ్మవారిని పూజించారు. దీంతో అంతటా శ్రావణ శోభ కనిపించింది.

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ సంతాన వేణుగోపాలస్వామి దేవస్థానంలో వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం చేశారు. వ్రతాలు, కుంకుమ పూజల వల్ల వచ్చే ఫలితాలను ఆలయ పండితులు వాడ్రేవు నాగరాజుశర్మ భక్తులకు వివరించారు.

సీఎం సభకు స్వచ్ఛందంగా తరలిన జనం

రామభద్రపురం: మెంటాడ మండలంలోని చినమేడపల్లి వద్ద ఏర్పాటు చేయనున్న కేంద్రీయ గిరిజన యూనివర్సిటీకి శంకుస్థాపన చేసేందుకు శుక్రవారం విచ్చేసిన జనహృదయ నేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్దసంఖ్యలో చినమేడపల్లి వెళ్లారు. మొత్తం 34 బస్సుల్లో వేలాదిగా తరలివచ్చిన జనంతో ఆ ప్రాంతం జనసందోహంగా మారింది. ఉత్తరాంధ్రలో అత్యంత వెనకబడిన ప్రాంతమైన విజయనగరం జిల్లా ప్రాంత అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని అందరూ ప్రశంసిస్తున్నారు. తామంతా జగనన్న వెంట నడుస్తామని, వచ్చే ఎన్నికల్లోనూ ఆయననే మళ్లీ సీఎంగా ఎన్నుకుంటామంటున్నారు. కార్యక్రమంలో గుల్లిపల్లి అప్పారావు, చౌక్కాపు లోకేశ్, చింతల పరశురాం, చౌక్కాపు శ్రీనివాసరావు, చౌక్కాపు శ్రీనివాసరావు, చుక్క అప్పలనాయుడు, చుక్క చిన్నంనాయుడు, రేజేట బంగారయ్య, సూర్యనారాయణ పాల్గొన్నారు.

బాడంగి: దత్తిరాజేరు మండలం, మరడాం దగ్గర ఏర్పాటు చేసిన సీఎం బహిరంగ సభకు బాడంగి మండలంలోని 25 పంచాయతీల నుంచి వేలాది మంది ప్రజలు తరలివచ్చారు. బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు నేతృత్వంలో జనమంతా సభాప్రాంగణానికి చేరుకుని, జై జగన్.. జై.. వైఎస్సార్ సీపీ అని నినాదాలు చేస్తూ సరికొత్త జోష్ కనబరిచారు.